
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 9 మార్చి 2025




నరసరావుపేట మున్సిపాల్టీ నీటి శుద్ధి ప్లాంట్

# వేసవి కార్యచరణకు.. రూ.9.29 కోట్లు

- ప్రభుత్వానికి మున్సిపాల్టీల ప్రతిపాదనలు
- ట్యాంకర్ల ద్వారా పట్టణాల్లో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- ప్రభుత్వం నుంచి నిధుల కోసం పురపాలకుల ఎదురుచూపు
- పల్నాడు జిల్లాలో పలు మున్సిపాల్టీల్లో రెండు రోజులకు ఒకసారే తాగునీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎండలు మండుతున్నాయి.. పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. మున్సిపల్ కేంద్రాల్లో తాగు నీటి సరఫరా కష్టంగా మారి ప్రజలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. పట్టణాల్లో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించేందుకు వేసవి కార్యచరణతో మున్సిపాలిటీలు సిద్ధమయ్యాయి. తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి అవసరమైన పురపాలకులు ప్రణాళికలు రూపొందించారు. గతంలో నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలను గుర్తించారు. ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సర పరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి పథకాల మరమ్మతులకు సిద్ధమయ్యారు. వేసవి ప్రణాళిక అమలుకు రూ.9.29 కోట్లు అవసరమని మున్సిపాల్టీలు ప్రభుత్వానికి ప్రతిపాదలను పంపాయి. అయితే ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం ఇంకా స్పందిం చలేదని అధికారులు చెబుతున్నారు. పల్నా డు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీల్లో ప్రస్తుత నీటి సరఫరా, వేసవి లో తలెత్తే సమస్యలను అధికారులు గుర్తిం చారు. వేసవిలో వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల, గురజాల పట్టణాలు ఏటా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం ఆయా పట్టణాల్లో పూర్తిస్థాయిలో నీటి సర ఫరా జరగడంలేదు. ఈ పట్టణాల్లో రెండు రోజులకు ఒక సారి నీటి సరఫరా చేస్తున్నా రు. మూడు జిల్లాల్లో ఒక్క నరసరావు పేటలో మాత్రమే రోజూ రెండు పూటల పుష్కలంగా నీటి సరఫరా జరుగుతోంది. మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి, చీరాల, బా పట్ల రేపల్లె మున్సిపాల్టీల్లో రోజూ నీటి సర ఫరా జరుగుతోంది. గుంటూరు, తెనాలి, పొన్నూరు, సత్తెనపల్లి మున్సిపాల్టీల్లో రోజూ ఒక పూట నీటి సరఫరా చేస్తున్నారు. గుర జాల మున్సిపాల్టీలో 69 రోజులకు, చిలక లూరిపేటలో 79 రోజులు, వినుకొండలో 67 రోజులకు సరిపడా నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటి నుంచే నీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, పైపులైన్లు తదితర మరమ్మతుల కోసం ప్రతిపాదిం చారు. ప్రభుత్వం నుంచి నిధుల విడుదల కోసం పురపాలకులు ఎదురుచూస్తున్నారు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో రూ.1.15 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించగా అం దులో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.30 లక్షలు అవసరమని పేర్కొన్నారు.

### ప్రతిపాదనలు ఇలా..

| మున్సిపాల్టీ | నిధులు |
|---|---|
| **పల్నాడు జిల్లా** | |
| నరసరావుపేట | రూ.1.62 కోట్లు |
| చిలకలూరిపేట | రూ.1.15 కోట్లు |
| వినుకొండ | రూ.70 లక్షలు |
| మాచర్ల | రూ.1.19 కోట్లు |
| గురజాల | రూ.30 లక్షలు |
| దాచేపల్లి | రూ.40 లక్షలు |
| పిడుగురాళ్ల | రూ.30 లక్షలు |
| సత్తెనపల్లి | రూ.15 లక్షలు |
| **గుంటూరు జిల్లా** | |
| పొన్నూరు | రూ.44 లక్షలు |
| తెనాలి | రూ.52.50 లక్షలు |
| మంగళగిరి-తాడేపల్లి | రూ.80 లక్షలు |
| **బాపట్ల జిల్లా** | |
| బాపట్ల | రూ.25 లక్షలు |
| అద్దంకి | రూ.21.50 లక్షలు |
| చీరాల | రూ.37 లక్షలు |
| రేపల్లె | రూ.88 లక్షలు |

### ముందస్తుగా మేల్కోవాలి..

ఈ ఏడాది నాగార్జునసాగర్ జలాశయం లో నీటి నిల్వలు నిండుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పురపాలకులు ముందుస్తుగా మేల్కోవాలి. ఈ నెలాఖరు వరకు కాల్వల కు నీట సరఫరా జరగనుంది. దీంతో ము న్సిపాల్టీల చెరువులను పూర్తిస్థాయిలో నిం పేందుకు అధికారులు తక్షణ చర్యలు చేప ట్టకుంటే పట్టణ ప్రజలగొంతెండటం ఖాయం.

# ముంపు మళ్లింపు






కొండవీటివాగు వరద జలాలను ఎగువ, దిగువ ప్రాంతాలకు మళ్లించే పథకం ప్లాను

- రాజధానిలో వరద నివారణ చర్యలు
- రూ.3 వేల కోట్లతో రెండు దశల్లో పనులు
- ప్రత్యర్థి పార్టీ నేతల కుట్రలతో పటిష్ఠ చర్యలు
- తొలిదశలో కొండవీటివాగు, పాలవాగు అభివృద్ధి
- వరద నివారణతో ఆకర్షణీయంగా అమరావతి నగరం

**రాజధాని అమరావతికి అతిపెద్ద సవాల్‌గా వరద ముంపును చిత్రీకరించారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణాన్ని సంక్లిష్టంగా మార్చేసింది. అమరావతికి లేని ముంపు సమస్యను భూతద్ధంలో రుణదాతలకు చూపుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులు కొందరు అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నారు. వాటిని అధిగమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన దృఢచిత్తంతో రాజధాని నిర్మాణ పనులను ముందుకే తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో వరద ముంపు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు సుమారు రూ.3 వేల కోట్లకు పైగా వ్యయంతో రెండు దశల్లో పనులను చేపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు హయాంలో ముంపు నివారణకు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా తీసుకుంటున్న చర్యలతో అమరావతికి వరదముంపు నుంచి శాశ్వత రక్షణ లభించినట్లే. ప్రత్యర్థి పార్టీ కుట్రపూరిత ఆలోచనల ఫలితంగా.. అనివార్యంగా చేపట్టాల్సి వస్తున్న వరదముంపు నివారణ పనులతో అమరావతి నగరం మరింత సుందరంగా ఆకర్షణీయంగా రూపుదిద్దుకోబోతుంది.**

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతికి కృష్ణానది వరదలతో ఎటువంటి ముప్పులేదు. గత వందేళ్ల చరిత్ర చూసినా ఇది తేటతెల్లమవుతోంది. ఎగువన నదికి ఇరువైపులా కరకట్టలు ఉన్నాయి. గత టీడీపీ పాలనలో కొండవీటివాగు వరదపై అవగా హన తో అప్పటి సీఎంగా చంద్రబాబు 2018లోనే ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అమరావతిని ఉక్కు పాదంతో తొక్కేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అమరావతిపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ప్రతిపక్ష పార్టీల పెద్దలు అమరావతికి వరదముంపు ఉందని రుణాలను ఇచ్చే సంస్థలకు పదేపదే ఫిర్యాదులను పంపుతున్నారు. ఆయా ఫిర్యాదుల నేపథ్యంలో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇస్తున్న సలహాలు, సూచనలతో కూటమి ప్రభుత్వం అమరావతిలో మరిన్ని వరద ముంపు నివారణ చర్యలను అనివార్యంగా మరింత పటిష్ఠవంతంగా చేపట్టాల్సి వచ్చింది. దీంతో కొండవీటివాగు, పాలవాగుతో పాటు గ్రావిటీ కెనాళ్ల కాల్వలను బ్రహ్మాండంగా వినియోగించుకోబోతున్నారు. దీంతో రాబోయే రోజుల్లో ప్రళయం ముంచుకొచ్చినా అమరావతికి ఎలాంటి ఢోకా ఉండబోదు.. సరికదా పర్యాటకంగా ఇవన్నీ అందర్నీ ఆకట్టుకుని ప్రభుత్వానికి ఆర్థికంగా లాభదాయకంగా మారనున్నాయి. సుందరమైన జలాశయాలు, గ్రావిటీ కెనాల్స్ నిర్మాణ పనులతో నగరమంతా బ్లూగ్రీన్ సిటీగా మారబోతుంది.

### రెండు భాగాలుగా విభజన.. రెండు దశల్లో పనులు

అమరావతి నగరాన్ని కొండవీటి వాగు ఎగువ పరీవాహక ప్రాంతం, దిగువ పరీవాహకప్రాంతమనే రెండు భాగాలుగా విభజించి రెండు దశలుగా వరద ముంపు నివారణ చర్యలను చేపట్టనున్నారు. రెండు దశల పనులను సమగ్రంగా చేపడితే ప్రపంచంలోనే అమరావతి అత్యంత సురక్షిత ప్రదేశంగా నిలిచిపోతుంది. పైగా ఆరు రిజర్వాయర్ల ఏర్పాటుతో నగర ప్రజల తాగునీటి అవసరాలు కూడా పుష్కలంగా తీరుతాయి. ముంపు నివారణ చర్యలను ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు అందజేస్తున్న రుణం నుంచి చేపడుతున్నారు. ఈ మొత్తం వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ యంత్రాంగం విప త్తుల నిర్వహణ సంస్థతో సమ న్వయం చేసుకుంటూ వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రిజర్వాయర్లలో హెచ్చుతగ్గులను నియంత్రిస్తూ ఎత్తిపోతల పథకాలను అవసరాన్ని బట్టి వినియో గిస్తుంటాయి. తద్వారా రాజధాని అమరావతిలో వరదలు తలెత్త కుండా చర్యలు తీసుకుంటారు.


- మొదటి దశలో కొండవీటివాగు దిగువ పరీవాహక ప్రాంతంలో నివారణ పథకం పనులను చేపట్టనున్నారు. ఈ పథకం తొలినుంచి అనుకుందే అయినా తాజాగా దీనిని మరింత విస్తృతస్థాయిలో చేపట్టనున్నారు. తొలిదశ పనుల కింద చేపట్టేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) గత జనవరిలో టెండర్లను ఆహ్వానించింది. కొండవీటివాగు, పాలవాగు విస్తరణ, శాఖమూరు రిజర్వాయర్ నిర్మాణానికి రూ.462.26 కోట్ల వ్యయంగా అంచనా వేస్తూ ఒక టెండర్‌ను పిలిచారు. గ్రావిటీ కెనాల్, కృష్ణాయపాలెం రిజర్వాయర్ నిర్మాణానికి రూ.303.73 కోట్ల వ్యయంగా అంచనా వేస్తూ మరో టెండర్‌ను ఆహ్వానించారు. నీరుకొండ రిజర్వాయర్ నిమిత్తం రూ.470.75 కోట్ల అంచనాతో మరో టెండర్‌ను పిలిచారు. ఉండవల్లి వద్ద ప్రస్తుతం ఉన్న ఎత్తిపోతల పథకం పక్కనే కొత్తగా 7360 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు మరో ఎత్తిపోతలను కూడా నిర్మించాలని ప్రపంచబ్యాంకు చేసిన సూచనను కూడా పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. దీనికి సుమారు రూ.300 కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉంది.

> శాఖమూరులో 50 ఎకరాల విస్తీర్ణంలో 0.03 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా, నీరుకొండలో 440 ఎకరాల్లో 0.43 టీఎంసీల నీటిని నిల్వచేసేలా, కృష్ణాయపాలెంలో 190 ఎకరాల్లో 0.09 టీఎంసీల నీటిని నిల్వచేసేలా చెరువులను నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.

- అనంతవరం నుంచి వయా శాఖమూరు, నీరుకొండ, కృష్ణాయపాలెం రిజర్వాయర్ల మీదగా ఉండవల్లి వరకు 23.6 కిలోమీటర్ల పొడవున్న కొండవీటివాగును, బోరుపాలెం నుంచి కొండమరాజుపాలెం మీదగా కృష్ణాయపాలెం రిజర్వాయర్ వరకు ఉన్న పాలవాగును లోతు చేసి విస్తరించనున్నారు.
- కొత్తగా నెక్కల్లు నుంచి తుళ్లూరు, అనంతవరం, పిచ్చుకలపాలెం వరకు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా గ్రావిటీ కెనాల్‌ను ఏర్పాటుచేయనున్నారు.
- రెండోదశలో కొండవీడు కొండల నుంచి వచ్చే వరద నీటిలో కొంత భాగాన్ని లాం వద్ద నుంచి పెదపరిమి మీదగా వైకుంఠపురం వైపు దారిమళ్లించనున్నారు. ఇందుకోసం లాం, పెదపరిమి, వైకుంఠపురంల వద్ద మూడు వేర్వేరు రిజర్వాయర్లను నిర్మించనున్నారు. వీటిని అనుసంధానిస్తూ గ్రావిటీ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. అవసరమైతే ఈ కెనాల్‌పై మినీ ఎత్తిపోతల పథకాలను మూడింటిని ఏర్పాటుచేసేలా డిజైన్ చేస్తున్నారు.
- చివరగా వైకుంఠపురం రిజర్వాయర్ నుంచి కృష్ణానదిలోకి మిగులు వరద జలాలను ఎత్తిపోసేందుకు 5650 క్యూసెక్కుల సామర్థ్యంతో భారీ ఎత్తిపోతలను ఏర్పాటు చేయనున్నారు.




కొండవీటివాగు మొత్తం పరివాహక ప్రాంతం



- కల్తీకారం తయారీకి సిద్ధంగా ఉన్న నాసిరకం మిర్చి

- కొండల మాటున యథేచ్ఛగా తయారీ
- ఇరవై రోజుల క్రితమే స్థానికుల ఫిర్యాదు
- కన్నెత్తి చూడని అధికారులు..
- టన్నుల కొద్దీ తరలింపు

# పేరేచర్లలో కల్తీకారం కర్మాగారం

మేడికొండూరు మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కారం అంటే ఓ బ్రాండ్. దీనిని అవకాశంగా తీసుకున్న కొందరు నాసిరకం కారం తయారీ చేసి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. మిరపకాయల తొడిమలు, రంగు మారిన కాయలు, వాటి విత్తనాలతో పొడిని తయారుచేసి దానికి రంగు, రసాయనాలు కలిపి నాణ్యమైన కారాన్ని తలదన్నేలా కల్తీకారాన్ని తయారు చేసి టన్నుల కొద్దీ తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో కల్తీ కారం తయారవుతుంది.. అధికారులు తెలుసు కోలేరు అనుకుంటే పప్పులో కాలేసినట్లే. గుంటూరు నగరానికి సమీపంలో మేడికొండూరు మండలం పేరేచర్ల కొండ ప్రాంతంలోనే కల్తీకారం కర్మాగారం ఏర్పాటు చేశారు. గుంటూరులోని కొన్ని పరిశ్రమల్లో మిర్చి కాయల నుంచి వేరు చేసిన తొడిమలను సేకరించి ఇక్కడకు చేరుస్తున్నారు. రాత్రి వేళల్లో భారీ యంత్రాలను ఉపయోగించి పనికిరాని కాయలను, తొడిమలను యంత్రాల్లో వేసి పొడిగా తయారు చేస్తున్నారు. ఆ పొడికి రసాయనాలు, వెల్లుల్లి వేస్ట్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటివి కలిపి స్వచ్ఛమైన కారంగా, చూడటానికి ఎంతో నాణ్యంగా కనిపించేలా తయారు చేస్తున్నారు. గన్నీ బ్యాగులలో ఈ కారాన్ని గుంటూరులోని గోడౌన్లకు తరలించి అక్కడ కేజీ నుంచి వంద గ్రాములు ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కొన్ని కంపెనీల బ్రాండ్ల పేరుతో కూడా ఈ కారాన్ని ప్యాక్ చేసి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ కల్తీ కారం గుంటూరు సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణకు తరలిస్తున్నారు. తక్కువ ధరకు వస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు, కర్రీ పాయింట్లలో వినియోగంతో పాటు చిల్లర దుకాణాల్లోనూ విక్రయిస్తున్నారు. కల్తీకారం ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నా సంబంధిత కల్తీ నిరోధక శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

### నాసిరకం విత్తనాలు...

ఇక్కడ కల్తీ కారంతో పాటు నాసిరకం విత్తనాలు కూడా తీస్తున్నారు. కొన్ని రకాల మిర్చి కాయలను ఎంపిక చేసుకుని యంత్రాల ద్వారా విత్తనాలను తీస్తున్నారు. ఈ విత్తనాలకు కొంత మంచి విత్తనాలను కలిపి రైతులకు విక్రయిస్తారని సమాచారం. విత్తనాలు తీయగా మిగిలిన కాయలను, తొడిమలను పొడిగా చేసి కారం తయారీకి వినియోగిస్తున్నారు.

### కళ్ల మంటలతో అల్లాడుతున్న ప్రజలు

మిర్చి తొడిమలను పొడిగా చేయాలంటే విపరీతంగా కోరు వస్తుంది. దీంతో కొండల మధ్య జనసంచారం లేని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని కర్మాగారం ఏర్పాటు చేశారు. కొండల ప్రాంతంలో జనసంచారం లేని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఏపుగా పెరిగిన చెట్ల మధ్య భారీ యంత్రాలను ఏర్పాటు చేసి కారం తయారు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలకు మొదలుపెట్టి ఉదయం 6లోపు ముగిస్తున్నారు. అప్పటి వరకు తయారు చేసిన కల్తీకారాన్ని మినీ లారీలలో లోడ్ చేసి గుంటూరులోని గోడౌన్లకు తరలిస్తున్నారు. తెల్లవారగానే జనరేటర్లు, యంత్రాలపై పట్టాలు కప్పి ఏమీ తెలియనట్లు వెళ్లిపోతున్నారు. ఆరు గంటల తర్వాత పేరేచర్ల గ్రామ ప్రజలకు కళ్ల మంటలు వస్తున్నాయి. తొలుత ఈ కళ్లమంటలకు కారణం తెలియక అయోమయంలో పడ్డారు. ఇటీవల కొందరు గ్రామస్తులు కొండల ప్రాంతంలో పరిశీలించగా మిర్చి బస్తాలు, తొడిమలు, పట్టాలు కప్పి ఉన్న యంత్రాలను గుర్తించారు. ఇరవై రోజుల క్రితం దీనిపై మేడికొండూ రు పోలీసులతో పాటు పంచాయతీ కార్యాలయం లో నూ ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకు ఆయా అధికారులు స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

> **రంజాన్ వేళలు**
> ఇఫ్తార్ : 6.22 (ఆదివారం)
> సహరి : 5.04 (సోమవారం)

# చంద్రబాబుతోనే మహిళల అభ్యున్నతి

- టీడీపీతోనే ఆడబిడ్డలకు ఆర్థిక స్వాతంత్ర్యం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి
- రేపల్లెలో వేడుకగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



స్వయం సహాయక సంఘాలకు చెక్కును అందిస్తున్న మంత్రులు పార్థసారథి, అనగాని, కలెక్టర్ వెంకటమురళి

రేపల్లె, బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రేపల్లెలోని ఎంసీపీ హాల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. మహిళల మేలు కోసం అప్పట్లో ఎన్టీఆర్ సమానహక్కులు కల్పిస్తే, స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్యం కల్పించడంలో చంద్రబాబు ఏళ్ల కృషి ఉందన్నారు. డ్వాక్రా సంఘాలకు పురుడుపోసి నేడు వారు లక్షల రూపాయల రుణాలు పొందేలా చేశారన్నారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడంలో ఆ సంఘాలే కీలకంగా పని చేస్తున్నాయన్నారు. ఇంటికో వ్యాపారవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని, వీరిలో మహిళలే ఎక్కువగా ఉండాలన్నది ఆయన ఆకాంక్ష అని తెలిపారు. ఒక్క మహిళా దినోత్సవం రోజునే కాకుండా మహిళలను నిత్యం గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిదన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని మాట్లాడుతూ మహిళలు చేసిన కృషి, త్యాగాల వల్లే నేడు మనందరం ఈ స్థాయిలో ఉన్నామన్నారు. మహిళలు వంటింటికే పరిమి తమనే ఆలోచనలో ఉన్న సమాజం ఉంటే, అవకాశాలు కల్పిస్తే వారు అన్ని రంగాల్లో సత్తాచాటగలరని నిరూపించిన దార్శనికుడు చంద్ర బాబుని కొనియాడారు. అటు కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూనే ఇటు వివిధ రంగాలలో రాణించడం మహిళలకే సాధ్యమ న్నారు. స్త్రీలేనిదే జననం లేదు, గమనం లేదని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభు త్వం చేపట్టిన ప్రణాళికలను, అమలు చేస్తున్న పథకాలను కలెక్టర్ వెంక టమురళి వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 592 స్వయం సహాయక సంఘాలకు, పీఎంఈజీపీ లబ్ధిదారులకు, 169 మెప్మా సంఘాలకు మంత్రులు చెక్కులను అందజేశారు. వివిధ రంగాలలో ప్రతిభ చూపిన 33 మంది మహిళలను సత్కరించారు. ఎస్పీ కార్యాలయంలోని ఐటీ కోర్ కానిస్టేబుల్ కీర్తి వర్మ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, లిడ్‌క్యాప్ చైర్మన్ మాబిక్యాల రావు, ఎస్పీ తుషార్ డూడీ, జేసీ ప్రఖర్‌జైన్, రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను సందర్శిస్తున్న మంత్రులు పార్థసారథి, అనగాని

నవ్య కుటుంబ కదంబం ఆదివారం




### ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

| ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ |
|---|---|---|
| **నెట్‌ఫ్లిక్స్** | | |
| అమెరికన్ మ్యాన్‌హంట్ | డాక్యూ సిరీస్ | మార్చి 10 |
| **అమెజాన్ ప్రైమ్** | | |
| వీల్ ఆఫ్ టైమ్ 3 | వెబ్‌సిరీస్ | మార్చి 13 |
| బీ హ్యాపీ | హిందీ చిత్రం | మార్చి 14 |
| **జీ5** | | |
| ఇన్ గలియోంమే | హిందీ చిత్రం | మార్చి 14 |
| **ఆపిల్ టీవీ ప్లస్** | | |
| డోప్ థీఫ్ | వెబ్‌సిరీస్ | మార్చి 14 |
| **ఈటీవి విన్** | | |
| పరాక్రమం | తెలుగు చిత్రం | మార్చి 13 |
| రామం రాఘవం | తెలుగు చిత్రం | మార్చి 14 |
| **సోనీ లివ్** | | |
| ఏజెంట్ | తెలుగు చిత్రం | మార్చి 14 |

## కూతురు కోసం తండ్రి తపన

దేశంలోని అతిపెద్ద డ్యాన్స్ రియాలిటీ షోలో ప్రదర్శన ఇవ్వాలన్న కూతురి కోరికను తీర్చేందుకు ఓ తండ్రి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సాగే హిందీ చిత్రం 'బీ హ్యాపీ'. అభిషేక్‌బచ్చన్ శివ అనే అంకిత భావం గల తండ్రి పాత్రను పోషించారు. ఇనాయత్ వర్మ ఆయన కూతురు ధార పాత్రలో కనిపించనుంది. డాన్స్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. తల్లి లేని లోటు తెలియకుండా అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురి కోరికను తీర్చేందుకు తపించే తండ్రి పాత్రలో అభిషేక్ నటన ఈ సినిమాకు ప్రధానాకర్షణ అని ట్రైలర్‌ను బట్టి



తెలుస్తోంది. తండ్రీ, కూతురు కలసి ముంబై వెళ్లడం, అక్కడ డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు వారు చేసే ప్రయత్నాల్లోంచి పుట్టే వినోదం అలరిస్తుంది. ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకత్వం వహించగా, సల్మాన్‌ఖాన్, ఇమ్రాన్ మజూర్ నిర్మించారు.

## వేసవిలో పిల్లలకు ఇవి తినిపించాలి..!

వేసవికాలంలో పిల్లలకు బలవర్ధకమైన పోషకాహారం అత్యవసరం. పెరుగుతున్న ఎండవేడిని తట్టుకునేలా సమయానుసారం పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలో తెలుసుకుందాం.

- ఎండ వేడిమి వల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. దీన్ని నివారించేందుకు తరచూ పిల్లల చేత చల్లని నీరు తాగిస్తూ ఉండాలి. ఫ్రిజ్ కంటే కుండలోని నీళ్లు ఆరోగ్యానికి మంచివి.
- మధ్యాహ్న సమయంలో పలుచని మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నిమ్మరసం, రాగి జావ, బార్లీ నీళ్లు తాగించాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌ల జోలికి వెళ్లనీయకూడదు.
- సబ్జా గింజలు లేదా చియా గింజలను నీళ్లలో నానబెట్టి వాటిని పండ్ల రసాలు లేదా చల్లని మజ్జిగలో కలిపి పిల్లలకు తాగించవచ్చు. సగ్గుబియ్యంతో తయారు చేసే జావ కూడా వేసవి తాపాన్ని హరిస్తుంది.
- పుచ్చకాయ, కర్బూజా, బొప్పాయి, నారింజ, స్ట్రాబెర్రీ, దానిమ్మ, మామిడి లాంటి తాజా పండ్లను పిల్లలకు తినిపించాలి. కీరా ముక్కలు, తాటి ముంజలు కూడా మేలు చేస్తాయి.
- పాలకూర, టమాటా, కేరట్, బీట్‌రూట్, సొరకాయ, బీరకాయ లాంటి కూరగాయలతో చేసిన వంటలను భోజనంలో చేర్చాలి.
- తాజా కూరగాయలు, పండ్లతో సలాడ్స్ స్మూతీలు తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, దోశ, పెసరట్టు, పోహా లాంటి తేలికగా జీర్ణమయ్యేవాటిని తినిపించాలి. మధ్యాహ్న భోజనంలో రకరకాల కూరగాయలతో తయారు చేసిన సాంబార్, మజ్జిగ ఉండేలా చూడాలి. వీటివల్ల పిల్లలకు జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరంలో నీటిశాతం నిలిచి ఉంటుంది. రాత్రి భోజనంలో ఆరోగ్యకరమైన సూప్‌ని చేర్చాలి. సాధ్యమైనంతవరకూ నూనె, మసాలా పదార్థాలను పిల్లలకు పెట్టకపోవడమే మంచిది.
- సాయంకాలం పిల్లలు ఆకలి అన్నప్పుడు కొన్ని డ్రై ఫ్రూట్స్, ఖర్జూరాలు, మొలకలు, తేనె కలిపిన పండ్ల ముక్కలు తినిపించవచ్చు.





'భంభం భోలే...' అంటూ ఖంగుమని మోగే కంచుకంఠం కైలాష్ ఖేర్‌ది! 'జేజమ్మ...', 'వచ్చాడయ్యా సామి...', 'కథానాయక...' లాంటి పాటలతో తెలుగువారికి దగ్గరయిన కైలేష్ ఖేర్ 19 భాషల్లో తన గానాన్ని వినిపిస్తున్నారు. ఆయన ఆత్మకథ 'తేరీ దివానీ' ఇటీవల విడుదలయింది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ...

# సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం

**చాలా మంది జీవితంలో చివరి దశలోనే ఆత్మకథలు రాస్తారు... మీరు ఇప్పుడే రాయటానికి కారణాలేమిటి?**

నా ఉద్దేశంలో ప్రతి వ్యక్తి జీవితం ఒక అందమైన కథ. దీనిలో అనేక పార్శ్వాలు ఉంటాయి. ఇవి కూడా మనల్ని అభిమానించేవారికి తెలియాలి. అయితే ఈ పార్శ్వాలను ఎంత జాగ్రత్తగా, ఎంత నిబద్ధతతో వారి దగ్గరకు తీసుకువెళ్తున్నామనేది ముఖ్యం. దీనికి మాధ్యమంగా నేను పుస్తకాన్ని ఎంచుకున్నాను. ఇక నా జీవితం సంగీతంతో ముడిపడి ఉంది. అందరికీ నేను ఒక గాయకుడిగా మాత్రమే తెలుసు. చాలాకాలంగా నా అభిమానులు నా దగ్గరకు వచ్చి "మీ పాటలు మా హృదయాన్ని తాకుతాయి. మీరు మనసు పెట్టి పాడతారు. అలా పాడటానికి వెనుక ఉన్న కారణాలేమిటి?" అని అడుగుతూ ఉంటారు. వారి కోసమే 'తేరీ దివానీ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను. ఒక సామాన్యుడు అసామాన్య కళాకారుడిగా ఎలా రూపుదిద్దుకున్నాడన్నదే ఈ పుస్తక కథ. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఈ పుస్తక ప్రచురణకర్తల్లో నేను కూడా ఒకడిని. ఎందుకంటే - మంచి పుస్తకాలు అందరి దగ్గరకు వెళ్లాలనేదే నా కోరిక. అందుకే 'కైలాస ఎడ్వర్‌టైజింగ్' అనే సంస్థను ఏర్పాటు చేసి 'పెంగ్విన్' సంస్థతో కలిపి ఈ పుస్తకాన్ని ప్రచురించాం.

**పుస్తక రచన సమయంలో మీ అనుభవాలేమిటి?**

మనం ప్రపంచాన్ని ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. ఒక ఏనుగును నలుగురు అంధులు వేరు వేరుగా చూస్తారు. వారి వారి అనుభవాలు వారికి ఉంటాయి. మనం కూడా అంతే. మనకు తెలిసిందే ప్రపంచం



అనుకుంటాం. కానీ ఈ పుస్తకం రాసేటప్పుడు నాకు అనేక అనుభవాలు కలిగాయి. ఆ సమయంలో కైలాష్ కేర్ పైకి కనిపిస్తాడు. కానీ వాడి చేత రాయించేవాడు ఈశుడే! ఈ విషయం నాకు పుస్తకం రాసే సమయంలో అర్థమయింది. ఆ సమయంలో నాకు ఒక మిత్రుడు సహకరిస్తున్నాడు. ఒక రోజు మేమిద్దరం కలుసుకోవాల్సి ఉంది. కానీ తను నాకు ఫోన్ చేసి- "నేను రాలేను" అని చెప్పాడు. ఎందుకో అప్పుడు నాకు - 'క్యా సజనా... బిన్ సజనా..' అనే రెండు మాటలు అప్రయత్నంగా వచ్చాయి. ఆ మాటల నుంచి అప్రయత్నంగా పాట పుట్టుకువచ్చింది. ఆ పాటను త్వరలోనే విడుదల చేయబోతున్నాం. ఇలాంటి అనుభవాలెన్నో.

**మీ ఆలోచనలు సంగీతంలో ఉంటాయా? మాటల్లో ఉంటాయా?**

నేను దేన్నీ ఆలోచించను. మనసులో వచ్చిన ఆలోచనలను ఎప్పటికప్పుడు మాటల రూపంలో పెడతానంతే! మాట్లాడినప్పుడు కూడా అంతే! అందుకే నా మాటల్లో స్పష్టత ఉంటుంది. మాటలు నది మాదిరిగా ప్రవహిస్తూ ఉంటాయి.

**మన దేశంలో సినిమా సంగీతానికి ఉన్న ప్రాధాన్యత దేశీయ సంగీతానికి ఉందని మీరు అనుకుంటున్నారా?**

మన దేశంలో సినిమా పాటలకు ఆదరణ ఎక్కువ. కానీ దేశీ సంగీతానికి కూడా స్థానికంగా చాలా ప్రాధాన్యం ఉంటుంది. మన దేశంలో ప్రతి ప్రాంతానికి ఒకో ప్రత్యేకత ఉంది. అక్కడ ఉన్న సంగీతం ఇతరులు కూడా విన్నప్పుడు దానిలో ఉన్న గొప్పదనం అర్థమవుతుంది. నేను గత పదేళ్లుగా 'భారత్‌కా అమృత్ కలశ్' అనే రియాలిటీ షో నిర్వహిస్తున్నాను. దీనిలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారి వారి వేష భాషల్లో వచ్చి పాటలు పాడతారు. ఛానల్స్‌లో కూడా ఇలాంటి షోలు రావాలి. లేకపోతే వాళ్ల రియాలిటీ షోలకు 'ఫిల్మీ రియాలిటీ షో' అని పేరు పెట్టుకోవాలి.

> **మీతో కలిసి ఆల్బమ్స్ చేయటానికి చాలామంది ఔత్సాహికులు వస్తూ ఉంటారు.. వారికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?**
>
> సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం. అంటే చాలా కష్టం తర్వాతే విజయం లభిస్తుంది. దానివల్ల ప్రసిద్ధులమవుతాం. కానీ ఈ మధ్యకాలంలో సులభంగా ప్రసిద్ధి చెందాలనే ఆలోచన చాలామందిలో కనిపిస్తోంది. మనల్ని ఇష్టపడే అభిమానుల సంఖ్య క్రమంగా పెరగాలి. అంతేతప్ప ఒకేసారి లక్షలమంది రావాలనుకోకూడదు. ఒక పాట హిట్ అయిన వెంటనే ప్రపంచాన్ని జయించామని అనుకోకూడదు.

**కైలాష్ ఖేర్ ఎప్పుడూ సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తూ కనిపిస్తారు. శుద్ధమైన హిందీలో మాట్లాడతారు. అందుకు కారణమేదైనా ఉందా?**

గత కొద్దికాలంగా నేను మాట్లాడే భాషలో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడు నేను మామూలుగా మాట్లాడేవాడిని. ఇప్పుడు శుద్ధంగా మాట్లాడటం నేను నేర్చుకున్నాను. నేను పాటలు పాడటం మొదలుపెట్టినప్పుడు నాకు ఏమీ తెలీదు. సినిమా పాటలు, 'చిత్రహార్' లాంటివి తెలీదు. టీవీలో షోలు కూడాఎప్పుడూ చూడలేదు. అలాంటి నేను ఇప్పుడు 19 భాషల్లో పాడుతున్నానంటే ఏదో ఒక కారణం ఉండాలి కదా! ఆ కారణం ఆధ్యాత్మికత. నా ఉద్దేశంలో ఆధ్యాత్మికత లేకపోతే భారత దేశం లేదు. ఇంగ్లీషు సంస్కృతి నాలుగైదు వందల సంవత్సరాల క్రితం వచ్చిందే. అంతకుముందు నుంచి 'బతుకు...బతకనివ్వు' అనేది మన సంస్కృతి. 'అందరూ బావుండాలి... అందులో మనం ఉండాలి' అనేది మన సంస్కృతి. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రపంచంలో అందరూ యంత్రాలు తయారుచేస్తున్న సమయంలో మనం మంత్రాలు జపించేవాళ్లం. వాళ్లు యంత్రాలు తయారుచేసి పిచ్చి వాళ్లు అయిపోయారు. ఇప్పుడు వారు మానసిక ప్రశాంతత కోసం మన దగ్గరకు వస్తారు. అంటే మన సంస్కృతి అంత గొప్పది. అలాంటి భావనను నేను ఎప్పుడూ వదలను. కైలాష్ కేర్ ఎప్పుడూ మారడు. ఆధ్యాత్మికతను వదలడు.

- సివిఎల్ఎన్ ప్రసాద్



కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్టు అధికారికంగా వెల్లడించారు.

వెండితెర ఎంట్రీ దక్కాలంటే ఆషామాషీ విషయం కాదు. అలాంటిది ఇండస్ట్రీనే ఎర్రతివాచీ వేసి ఆహ్వానిస్తే ఎలా ఉంటుంది. పరిశ్రమలో నటీనటుల వారసుల పరిచయానికి ఉండే క్రేజే వేరు. కొత్తగా వచ్చే వారసులకు తమ తల్లిదండ్రుల అభిమానుల ఆదరణ కూడా విశేషంగా ఉంటుంది. అలా వెండితెర ఎంట్రీ ఇస్తున్న కొత్త తరంపై ఓ లుక్కేద్దాం.



# వారసులు వచ్చేస్తున్నారు...



ఎన్టీఆర్ నటవారసత్వాన్ని నందమూరి బాలకృష్ణ అందుకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ కుటుంబం నుంచి మూడు తరాల నటులు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. తాజాగా, ఆ కుటుంబం నుంచి నాలుగో తరానికి చెందిన ఇద్దరు నూతన కథానాయకులు చిత్రసీమను పలకరించనున్నారు. అందులో ఒకరు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కాగా, మరోకరు హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు తారకరామారావు. కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇది ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో సూపర్ హీరో కథాంశంతో తెరకెక్కనుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. దీని తర్వాత తన తండ్రి బాలకృష్ణ దర్శకత్వంలో 'ఆదిత్య 999 మ్యాక్స్' చిత్రంలో మోక్షజ్ఞ నటించనున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అలాగే, "సార్, 'లక్కీ భాస్కర్' చిత్రాలతో సూపర్‌హిట్‌లు అందుకొన్న వెంకీ అట్లూరీ కూడా మోక్షజ్ఞ కోసం ఓ కథ తయారుచేశారట. నట వారసులను, కొత్తతరాన్ని ఇండస్ట్రీకి పరిచయం చేయడంలో ముందుంటారు దర్శకులు వైవీఎస్ చౌదరి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఓ సినిమాలో జానకీరామ్ తనయుడు తారకరామారావు కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇటీవలె ఈ సినిమాను ప్రకటించడంతో పాటు తారకరామారావు లుక్‌ను విడుదల చేశారు. ఇందులో కథానాయికగా వీణా రావు నటిస్తున్నారు. ఈ ఏడాదే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.





### మరో మేనల్లుడు సిద్ధం

ఘట్టమనేని కుటుంబం నుంచి తెరంగేట్రం చేసేందుకు మరో వారసుడు సిద్ధమయ్యారు. మహేశ్‌బాబు అల్లుడిగా ఇప్పటికే అశోక్ గల్లా 'హీరో' సినిమాతో పరిచయమై ప్రేక్షకులను మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అశోక్ తమ్ముడు సిద్ధార్ధ్ గల్లా కూడా సిల్వర్‌స్క్రీన్ వైపు అడుగులేస్తున్నారు. రచయిత గోపీ మోహన్ దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. అలాగే, మహేశ్‌బాబు అన్న కుమారుడు రమేశ్‌బాబు తనయుడు కూడా వెండితెరపై అలరించేందుకు ముస్తాబవుతున్నారు.

### బాలనటులుగా

మంచు కుటుంబం నుంచి మూడో తరం వారసులు వెండితెర ఎంట్రీకి రెడీ అయ్యారు. మంచు మోహన్‌బాబు, ఆయన తనయులు విష్ణు, మనోజ్ నటులుగా ఇప్పటికే ఇండస్ట్రీలో ఉన్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమాతో ఆయన తనయుడు అవ్రామ్, కుమార్తెలు అరియాన, వివియాన బాలనటులుగా పరిచయం అవుతున్నారు. భారీ తారాగణంతో ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది.

### డియోల్ కుటుంబం నుంచి..

'యానిమల్' సినిమాతో ఫామ్‌లోకి వచ్చారు బాబీ డియోల్. ఆయన కుమారులు ఆర్యమన్ డియోల్, ధరమ్ డియోల్ కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. తెలుగులో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా 2023లో విడుదలై ఘనవిజయం సాధించిన 'బేబీ' సినిమాను ఆర్యమన్ డియోల్ హీరోగా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో దివంగత నటుడు ఇర్ఫాన్ ఖాన్ తనయుడు బాబిల్ కూడా నటించనున్నట్లు టాక్. హీరోయిన్లుగా సారా అలీఖాన్, క్రితి శెట్టి పేర్లను పరిశీలిస్తున్నారు.

### సైఫ్ నటవారసుడు



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ వారసురాలిగా సారా అలీ ఖాన్ ఇప్పటికే సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సైఫ్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. షౌనా గౌతమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నదానియాన్' చిత్రంలో నటించారు. ఇటీవలె ఈ సినిమా విడుదలైంది. ఆయన ప్రస్తుతం కునాల్ దేశ్‌ముఖ్ దర్శకత్వంలో 'దిలెర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది.

### మెగాఫోన్‌తో...

స్టార్ హీరోల వారసులు ఎక్కువ మంది నటులుగా మారుతుంటే.. వారికి భిన్నమైన దారిలో ప్రయాణిస్తున్న వారూ ఉన్నారు. తమిళ కథానాయకుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టనున్నారు. సందీప్ కిషన్ హీరోగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ కూడా దర్శకత్వం వైపు అడుగులేస్తున్నారు. 'బా..డ్స్ ఆఫ్ బాలీవుడ్' పేరిట నెట్‌ఫ్లిక్స్ రూపొందిస్తున్న ఈ సెటైరికల్ వెబ్ సిరీస్‌కు ఆర్యన్ ఖాన్ దర్శకుడు. ఇందులో షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ తదితరులు అతిథి పాత్రల్లో మెరవనున్నారు.

### యంగ్ పవన్‌గా..

పవన్‌కల్యాణ్ తనయుడు అకీరా నందన్ వెండితెరపైకి ఎంట్రీ ఇవ్వకున్నా.. మెగా అభిమానులకు బాగా సుపరిచితమే. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో అకీరా చేసే వీడియో ఎడిట్స్‌ను మెచ్చుకుని మురిసిపోతుంటారు మెగాభిమానులు. ప్రస్తుతం పవన్ కథానాయకుడిగా 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' తెరకెక్కుతోంది. ఇందులో పవన్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో అకీరా మెరవనున్నట్లు టాక్.

నటించే సామర్థ్యంతో పాటు కీబోర్డ్ ప్లేయర్‌గానూ అకీరాకు ప్రవేశముంది. దీంతో ఈ సినిమాలో తమ సంగీత బృందంలో అకీరాను చేర్చుకునే ఆలోచనలో ఉన్నట్లు తమన్ తెలిపారు.



# డీవీసీలో పూర్తి స్థాయి గుండె శస్త్ర చికిత్సలు


మాట్లాడుతున్న డీవీసీ హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ల జ్యోతిర్మయి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డీవీసీ హాస్పిటల్‌లో పూర్తి గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ల జ్యోతిర్మయి తెలిపారు. శనివారం వడ్లమూడి డీవీసీ హాస్పిటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వైద్య బృందం, జ్యోతిర్మయి మాట్లాడుతూ డీవీసీ హాస్పిటల్ ప్రారంభించిన అనతి కాలంలోనే విస్తృత సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. 2020లో ఈసీజీ, ఎకో, డీఎంటీ వంటి వైద్య పరీక్షలతో ప్రారంభమైన కార్డియాలజీ విభాగం 2021లో చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా అత్యాధునిక క్యాథలాబ్ సమకూర్చుకున్నట్లు చెప్పారు. అతి తక్కువ సమయంలోనే 4 వేల ప్రొసీజర్‌లకు చేరువైనట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి వైద్య పరికరాలను డీవీసీ హాస్పిటల్‌లో చైర్మన్ నరేంద్రకుమార్ సహకారంతో సమకూర్చామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం హాస్పిటల్‌లో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత 3 శస్త్ర చికిత్సలు ఆయూష్ హాస్పిటల్ సహకారంతో పూర్తి చేసినట్లు చెప్పారు. గుండె రక్త నాళాలల్లో పూడిక తొలగించడం, స్టంట్ అమరిక, బైపాస్ సర్జరీలు వంటి శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. చిన్నారులకు పుట్టుకతో వచ్చే గుండె సమస్యలకు కోత లేకుండా డివైజ్ పద్ధతిలో చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. వాల్వ్ రిప్లేస్‌మెంట్, గుండె రంధ్రాల పూడిక వంటి చికిత్సలు విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ డాక్టర్ కరణం నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ రామ్‌కిషోర్, డాక్టర్ సుందరరావు పాల్గొన్నారు.

## 27న బార్ అసోసియేషన్ ఎన్నికలు

గుంటూరు (లీగల్), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ 2025-26 సంవత్సరానికిగానూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత ప్రధాన కార్యదర్శి గురజాల అనూరాధ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో నామినేషన్లు స్వీకరించి, పరిశీలన, ఉపసంహరణల అనంతరం ఈ నెల 18న సాయంత్రం వివిధ పోస్టులకుగానూ పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. 27న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం ఓట్ల లెక్కింపు జరుపుతామని, రాత్రికే ఫలితాలు వెల్లడిస్తామని ఆమె చెప్పారు. 2004 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. బార్ అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఈసారి అధ్యక్ష పదవికి చతుర్ముఖ పోరు జరుగుతుంది. యంగలశెట్టి శివసూర్యనారాయణ (బబ్లూ), మధిర నాగేశ్వరరావు, ఖాజా భరద్వాజ, నంబూరు పాములు పోటీలో ఉన్నారు.

# పాపులను రక్షించే దైవకుమారుడు ఏసయ్య

- హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- నేటితో గుడారాల పండగ ముగింపు


ప్రసంగిస్తున్న చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ


పండగలో పాల్గొన్న విశ్వాసులు

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పాపులను రక్షించేందుకు పరలోకం నుంచి దిగివచ్చిన దైవకుమారుడు ఏసయ్య అని హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ తెలిపారు. అమరావతి మండలం లేమల్లె గ్రామంలోని దయాక్షేత్రంలో జరుగుతున్న 48వ గుడారాల పండగలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన దైవజనులు, విశ్వాసులను ఉద్దేశించి ప్రసంగించారు. విశ్వాసులు చేసే ప్రార్థనకు సమాధానం చెపుతారని, స్వస్థత కల్పిస్తారని తెలిపారు. ఏసయ్యను నమ్మిన వారికి సమస్యల నుంచి విముక్తి కలిగించి సంతోషం కల్గిస్తారన్నారు. పాస్టర్లు అనిల్, రాజశేఖర్, రమేష్, రాజు దేవుని వాక్యం అందించి ఏసయ్యను ప్రార్థించారు. సూర్యుని వెలుగు ప్రకాశించినట్లు ఏసయ్య కరుణ దయాక్షేత్రంలో ఉన్న ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. దైవజనులు ఆలపించిన భక్తిగీతాలు విశ్వాసులను తన్మయత్వంలో ముంచాయి. జయ సంకేతమా.. దయాక్షేత్రమా అనే పాటను ఆలపించి హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ రమేష్ అందర్నీ భక్తి సాగరంలో ముంచారు. గురువారం ప్రారంభమైన గుడారాల పండగ ఆదివారంతో ముగుస్తుంది. మధ్యాహ్నం 1 గంట వరకు దైవజనుల ప్రసంగాలతో పండగ ముగుస్తుంది.

# ప్రైవేటు యూనివర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమం సందర్భంగా ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. అయితే అకారణంగా మంత్రి బంధువు కుమారుడిపై పలువురు దౌర్జన్యం చేసి, కిడ్నాప్ చేయడంతో అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి కథనం ప్రకారం.. వాసంశెట్టి సంతోష్ అనే విద్యార్థి స్థానిక ప్రైవేటు యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. సంతోష్ యూనివర్సిటీలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమానికి శుక్రవారం రాత్రి విచ్చేశాడు. ఇదే కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు కూడా విచ్చేశారు. యూనివర్సిటీలో స్టాల్స్ వద్ద ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ జరగడంతో ఓ విద్యార్థి కార్యక్రమానికి వచ్చిన పూర్వ విద్యార్థులకు తనపైన ఓ విద్యార్థి ఘర్షణకు దిగాడని, ఆ విద్యార్థి గురించి చెప్పడంతో విజయవాడకు చెందిన హరి, వినోద్ మరికొందరు సదరు విద్యార్థి కోసం గాలించారు. ఈ క్రమంలో ఆ విద్యార్థి మంత్రి బంధువు కుమారుడి కారులో దూరం వెళ్లి యూనివర్సిటీ గేటు వద్ద దిగిపోయాడు. అనంతరం సంతోష్ తన కారులో వెళుతుండగా ఘర్షణకు సంబంధం ఉన్న విద్యార్థి సదరు కారులో ఉన్నాడని ఊహించి పలువురు సంతోష్ కారును వెంబడించారు. కొలనుకొండ రైల్వే గేటు వద్ద గేటు పడి కారు ఆగగానే వారు కారులో ఉన్న సంతోష్‌ను దింపి తమ కారులో ఎక్కించుకుని మెల్లెంపూడి వైపు వెళ్లి అక్కడ ఘర్షణలో ఉన్న విద్యార్థి ఎక్కడంటూ సంతోష్‌ను ప్రశ్నించి దౌర్జన్యం చేశారు. ఆ మార్గాన వస్తున్న స్థానికులను చూసి హరికృష్ణ, సుమారు ఆరుగురు పరారయ్యారు. గాయపడిన సంతోష్‌ను విజయవాడలోని వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించి పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా గాయపడిన సంతోష్ ఓ మంత్రి బంధువని తెలిసిందని ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

# కోర్కెలు తీర్చే తల్లి సాగరమాత


దైవ సందేశం అందిస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఆంతోని

మాచర్ల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తల్లి సాగరమాత అని నెల్లూరు సహవారస పీఠాధిపతి డాక్టర్ పల్లి ఆంతోని అన్నారు. మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగర మాత ఉత్సవాల్లో రెండో రోజైన శనివారం ఆలయంలోని జపమాల క్షేత్రంలో ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన జరిగిన సమష్టి దివ్యపూజాబలిలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై దైవ సందేశం అందించారు. క్రైస్తవులు ఆదర్శంగా నిలవాలన్నారు. తోటి వారిని ఆదరించడం, ప్రేమను పంచడం క్రైస్తవ్యమన్నారు. ఉదయం 5 గంటలకు గురుశ్రీ చిన్నాబత్తిని కిరణ్‌కుమార్, 6 గంటలకు తుమ్మా కరుణాకరరెడ్డి, 7 గంటలకు పామిశెట్టి బాలస్వామి, 8 గంటలకు ఆర్ రాజు, 9.30 గంటలకు రవికుమార్, 11.30 గంటలకు అల్లం చిన శౌరెడ్డిలు దివ్య బలిపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిపారు. సాయంత్రం కోలాట ప్రదర్శన నిర్వహించారు. రాత్రి కొవ్వొత్తులతో తేరు ప్రదక్షణ, సాగరమాత మహిమలు బుర్రకథ, శిలువదారి బైబిల్ నాటకం నిర్వహించారు.

## డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సాయి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈ నెల 11లోగా పది మార్కుల జాబితా, ఆధార్, ఫొటో తదితర వివరాలతో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న జిల్లా శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం ఎస్‌కే మస్తాన్ ఏటీవో (9704668909)ను సంప్రదించాలని సూచించారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో విద్యార్థి మృతి


రాహుల్ గాంధీ (ఫైల్)

పెదకాకాని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ నానో టెక్నాలజీ (ఐదేళ్ల కోర్సు) చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాహుల్ గాంధీ (20) బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం మృతి చెందారు. విద్యార్థి రాహుల్ గాంధీ ఈ నెల 7న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. వెంటనే అతనిని వైద్య సేవలు నిమిత్తం ఆసుపత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. ఏఎన్యూ ఉన్నతాధికారులు, నానో టెక్నాలజీ అధ్యాపకులు, సహచర విద్యార్థులు రాహుల్ గాంధీ మృతి పట్ల సంతాపం తెలిపారు.



# వైభవంగా పల్నాటి తిరుమల తిరునాళ్ల

- వేంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు
- కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


స్వామి వారిని దర్శించునేందుకు క్యూ లైన్లో భక్తులు

రాజుపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు కొండపై ఉన్న మత్స్యావతార స్వయంభువుగా వెలసిన వేంకటేశ్వరస్వామి రెండో శనివారం తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని ఉదయం 7 గంటల నుంచే భక్తుల రాక ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. రెండో శనివారం పల్నాటి తిరుమల మత్స్యావతార వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివారి సన్నిధిలో ఎక్కువ మంది మహిళలు పొంగళ్లు పొంగిచ్చారు. పంటలు ఇళ్లకు వచ్చిన తరువాత వచ్చే పల్నాటి తిరుమల తిరునాళ్ల కావటంతో ధాన్యాన్ని స్వామివారికి సమర్పించారు. తిరునాళ్లకు పల్నాడు జిల్లా నుంచే కాక ఉమ్మడి గుంటూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దాదాపు 17 వేల మంది దర్శించుకున్నట్లు ఈవో సురేష్ తెలియజేశారు. తిరునాళ్లకు సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాల నుంచి ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

### హుండీ ఆదాయం రూ.10 లక్షలు

పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు మత్స్యావతార వేంకటేశ్వరస్వామి రెండో శనివారం హుండీ ఆదాయం రూ. 10,97,573 వచ్చినట్లు ఈవో సురేష్ తెలియజేశారు.

# మహిళల అభివృద్ధి ఘనత చంద్రబాబుదే


డ్వాక్రా మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చిలకలూరిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి ఘనత చంద్రబాబుదేనని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ కౌన్సిలర్లలో ఎక్కువ మంది మహిళలు ఉండటం గర్వించాల్సిన విషయమనీ, సృష్టికి మూలమైన స్త్రీమూర్తులందరికీ హృదయ పూర్వక మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పురుషులతో సమానంగా రాణించాలనే సంకల్పంతో రాష్ట్ర మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ఆలోచించి డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి, కుటుంబాలే మహిళలపై ఆధారపడే పరిస్థితి తీసుకొచ్చారని తెలిపారు. దేశం గర్వించే స్థాయిలో ఆంధ్రప్రదేశ్ డ్వాక్రా మహిళలు తమ పనితీరుతో ముందుకు సాగుతున్నారన్నారు. మహిళల్ని ఆర్థికంగా, సామాజికంగా అగ్రస్థానంలో నిలిపేలా, పారిశ్రామిక వేత్తలుగా వారు ఎదిగేలా చంద్రబాబు ఎంతో చొరవ తీసుకున్నారన్నారు. తెలుగు యువతులు ఐటీ సహా, అన్ని రంగాల్లో ప్రపంచస్థాయిలో రాణించడానికి కారణం చంద్రబాబు దూరదృష్టేనన్నారు. డ్వాక్రా మహిళలు తమ ఉత్పత్తుల్ని ఆన్‌లైన్లో విక్రయించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించడం అభినందించాల్సిన విషయమన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా డ్వాక్రా గ్రూపుల్ని ప్రోత్సహిస్తున్నామని, డ్వాక్రా మహిళలు కూడా రాష్ట్రాభివృద్ధికి తగిన సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా డ్వాక్రా బజార్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించారు. డ్వాక్రా మహిళలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ఎంపీ, ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి, జనసేన ఇన్‌చార్జి తోట రాజా రమేష్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరిబాబు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో రాజధాని రైతుల కేసులు పరిష్కారం



కోర్టుకు వచ్చిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్

మంగళగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కోర్టుల పరిధిలో శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో రాజధాని రైతులకు చెందిన ఏడు కేసులు పరిష్కారం కాగా అందులో డ్రోన్ కేసుకు సంబంధించి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ కూడా రైతులు, జేఏసీ సభ్యులతో కోర్టుకు హాజరయ్యారు. ఇప్పటికే రాజధాని రైతులకు సంబంధించి పలు కేసులు గత లోక్ అదాలత్‌లో పరిష్కారమైన విషయం విదితమే.

### లోక్ అదాలత్‌లో 292 కేసుల పరిష్కారం

మంగళగిరి కోర్టుల పరిధిలో శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో మొత్తం 292 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో క్రిమినల్, ఎన్ఐ యాక్టులు, సీసీలు, ఎక్సైజ్, ఎంసీ, డీవీసీ, 15 సివిల్ కేసులు ఉన్నాయి. వివిధ బ్యాంక్‌లకు సంబంధించి పలు కేసులు పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎం అంజనీ ప్రియదర్శిని, లోక్ అదాలత్ బెంచి న్యాయవాది భారతి, అడిషనల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కమ్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన లోక్ అదాలత్ బెంచ్‌లో న్యాయమూర్తి కె.సురేష్‌బాబు, లోక్ అదాలత్ బెంచి న్యాయవాది రెంటపల్లి రాజేష్ పాల్గొన్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు. కాగా శనివారం రాత్రి 9 గంటల వరకు లోక్ అదాలత్ కేసుల పరిష్కారం కొనసాగింది.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

# రోడ్డు ప్రమాదంలో హైకోర్టు ఉద్యోగి మృతి

రాజుపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో హైకోర్టు ఉద్యోగి మృతి చెందిన సంఘటన గుంటూరు-మాచర్ల రహదారిపై శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన జరపాల సంధ్యానాయక్(34) హైకోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. నేడు ఆదివారం సెలవు కావటంతో స్వగ్రామమైన జూలకల్లు బయల్దేరాడు మార్గమధ్యలోని రెడ్డిగూడెం గ్రామం దాటుతూ ముందుపోతున్న లారీని క్రాస్ చేస్తున్న క్రమంలో వెనుక టైర్ కింద పడ్డాడు. ఈ సంఘటనలో సంధ్యానాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై వేణుగోపాల్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 88, 95, 105 |
| చికెన్ విత్ స్కిన్ | 170.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 180.00 |

## కేంద్రీయ విద్యాలయలో ప్రవేశాలకు నోటిఫికేషన్

బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక కేంద్రీయ విద్యాలయలో ఒకటవ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ వి.మృదుల తెలిపారు. ఆసక్తి గలవారు వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. 2 నుంచి 9వ తరగతి అడ్మిషన్ కొరకు ఏప్రిల్ 2 నుంచి 11 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు జరుగుతాయని ఆమె తెలిపారు.

# మహిళలకు గుర్తింపు తెచ్చిన పార్టీ తెలుగుదేశం

- వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ద్వాక్రా యానిమేటర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అమృతలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు గుర్తింపు తెచ్చిన పార్టీ తెలుగుదేశం అని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కూచిపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వాలంబన కల్పించే కార్యక్రమాలు చేపట్టినది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అనంతరం పలువురు మహిళలను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మారుతీ శేషమాంబ, ఈవోపీఆర్డీ రవిశంకర్, సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ సుమలత, ఏపీఎం రాంబాబు, తిరుమలరావు పాల్గొన్నారు.

### మహిళల త్యాగాలు నిరుపమానమైనవి : డీఎంహెచ్‌వో



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, డాక్టర్ సిద్దార్థ, సునీల్‌కుమార్ తదితరులు

బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళల త్యాగాలు నిరుపమానమైనవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ అన్నారు. ఫోరంఫర్ బెటర్, బాపట్ల ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణపురంలోని పీఎస్‌కే విద్యాసంస్థలలో ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి విద్యాసంస్థల చైర్మన్ పేర్లి సునీల్‌కుమార్ అధ్యక్షత వహించారు. అవయవదానం కోసం ముందుకొచ్చిన పీఎస్‌కే విద్యాసంస్థల కార్యదర్శి పేర్లి సంపతకుమారి, మరుప్రోలువారిపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమిరిశెట్టి రమాదేవిలను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అవయవదాతల సంఘం అధ్యక్షుడు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్దార్థ, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, ఉపాధ్యాయుడు గురజాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎకో హౌస్‌లో...



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న జీసీడీవో చారులత

బాపట్లలోని చీలురోడ్డు సెంటర్‌లో గల ఎకో హౌస్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం బాపట్ల మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ, బాపట్ల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమాజంలో మహిళల పాత్ర ప్రాముఖ్యత గురించి జీసీడీవో చారులత వివరించారు. కార్యక్రమానికి మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ డాక్టర్ బి.శరత్‌బోస్ అధ్యక్షత వహించగా శానిటరి ఇన్‌స్పెక్టర్ కరుణ, డాక్టర్ మీనా ప్రసంగించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

### బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో..



డాక్టర్ నిరుపమను సన్మానిస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, మహిళా ఉద్యోగులు

ప్రస్తుత జీవన విధానంలో తరచూ క్యాన్సర్ గురించి వింటున్నామని దీనిపై మరింత అవగాహన పెంపొందించుకోవాలని డాక్టర్ నిరుపమ తెలిపారు. బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అపోలో స్పెక్టర్ చీరాల వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావు పాల్గొని మహిళా దినోత్సవ విశిష్టత గురించి వివరించారు. అనంతరం అధ్యాపకులను విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో..



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల రవాణాశాఖ వాహన తనిఖీ అధికారి ఎన్.ప్రసన్నకుమారి

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాపట్ల రవాణాశాఖ వాహన తనిఖీ అధికారిణి ఎన్.ప్రసన్నకుమారి పాల్గొని మాట్లాడుతూ మహిళలు తమ లక్ష్యాలను సాధించటానికి ధృడసంకల్పంతో ముందుకు సాగాలన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలోను పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. సెక్రటరి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళా శక్తి సామర్థ్యాలను గుర్తించి వారికి సరైన అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

### బాపట్లలో పోలీసుల మహిళా దినోత్సవ ర్యాలీ



చీలురోడ్డు సెంటర్‌లో కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్రనాయకురాలు రమాదేవి

బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా మహిళల సమానత్వం కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నా సమానత్వం సాధించటంలో వెనుకబడి ఉన్నామని ఐద్వా రాష్ట్ర నాయకురాలు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డీఎస్పీ రామాంజనేయులు ఆధ్వర్యంలో పట్టణ సీఐ ఆర్.రాంబాబు పర్యవేక్షణలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాలు స్త్రీలను రాజ్యాంగా పరంగా పాలనలో భాగస్వాములను చేయాలన్నారు. చీలురోడ్డు సెంటర్ నుంచి పాతబస్టాండ్ వరకు జరిగిన ర్యాలీలో డీఎస్పీ రామాంజనేయులు, పట్టణ సీఐ ఆర్.రాంబాబు, సర్కిల్ సీఐ హరికృష్ణ, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు విజయ్‌కుమార్, చంద్రావతి, శ్రీనివాసరావు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు కె.సుబ్బారావు, ఎ.పిచ్చయ్య, అడే జోత్స్న, రాజకుమారి, భవానీ, అరుణకుమారి, కోమలి, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్రసాంకేతిక కళాశాలలో...

ప్రతి వ్యక్తి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్రసాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ తెలిపారు. కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ బ్లెస్సీ సాగర్, డాక్టర్ సీహెచ్ సోమేశ్వరరావు, డాక్టర్ వై.అరుణకుమారి, డాక్టర్ బి.సునీత, ఎం.లక్ష్మీ లావణ్య, డాక్టర్ వై.ఫణేంద్రకుమార్, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ కార్యాలయంలో...

జిల్లా వైసీపీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అశ్వినిరెడ్డి పార్టీశ్రేణులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జునతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళా నాయకులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకులు గొర్రెముచ్చు పుష్పరాజ్యం, షేక్ మీరావలి, లక్ష్మీ రాఘవ, దేవరపల్లి జయమణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

### పోలీసు శాఖ ఆధ్వర్యంలో...

వేమూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో శనివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్డులో డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పలువురు వక్తలు సమాజంలో మహిళల పాత్రపై విశదీకరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు రైటర్ ప్రసాదరావు, ఏపీఎం శోభన్, మహిళా పోలీసులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




వేమూరులో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ ర్యాలీ

### గుళ్ళపల్లిలో...

చెరుకుపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గుళ్ళపల్లిలోని ఈఎస్ఆర్ నర్సింగ్‌హోమ్‌లో వైసీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, కేశవతి దంపతులు కేక్ కట్ చేసి మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గణేష్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలో పురోగతి సాధించాలన్నారు. చెరుకుపల్లిలోని హనీ షాపింగ్‌మాల్‌లో జరిగిన కార్యక్రమంలో చెరుకుపల్లి జడ్పీటీసీ మర్రివాడ వెంకటపావని, సీనియర్ మహిళ తలశిల నాగమణిని సన్మానించారు.

### భట్టిప్రోలులో...

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పంచ్ దారా రవికిరణ్మయి కేక్ కట్ చేశారు. వెల్లటూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గీతా మందిరంలో మహిళా దినోత్సవం జరిగింది. ఆధ్యాత్మిక కార్యక్రమాలు భజన బృందాలు నిర్వహించాయి. ఆయా కార్యక్రమాల్లో సెక్రటరీ కోటా శ్రీనివాసరావు, సచివాలయ, అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు. వెల్లటూరులో మాజేటి పద్మావతి, సుగ్గల వసుంధరలను సన్మానించారు. చిరువ్యాపారాలు చేసుకునే సుగాలి మహిళలకు గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తూనుగుంట్ల శ్రీధర్, గోలి చంద్రయ్య, పవన్, దేవకి ప్రసాద్, క్రాప రవికుమార్, వేములపల్లి వనజాక్షి, ఆంజనేయులు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో మహిళా దినోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న సర్పంచ్ కిరణ్మయి, మహిళలు

## జిల్లాలో 20,389 ఎకరాలలో ఆక్వాసాగు

- మత్స్యశాఖ జేడీ కృష్ణకిషోర్






బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 25 మండలాలలో 20,389 ఎకరాలలో ఆక్వాసాగు చేస్తున్నట్లు మత్స్యశాఖ జేడీ బి.కృష్ణకిషోర్ తెలిపారు.

**ప్రశ్న:** జిల్లాలో ఎంతమంది రైతులు ఆక్వాసాగు చేస్తున్నారు?

**జేడీ :** జిల్లాలో 6,606 మంది రైతులు ఆక్వాసాగు చేస్తున్నారు.

**ప్రశ్న:** ఎంత విస్తీర్ణంలో ఆక్వాసాగు ఉంది? ఎన్ని ఎకరాలకు అనుమతులిచ్చారు?

**జేడీ :** జిల్లా వ్యాప్తంగా 20,389 ఎకరాలలో ఆక్వాసాగు చేస్తుండగా 6,724 ఎకరాలకు రిజిష్టర్ అయ్యింది. 800 ఎకరాలు ప్రాసెస్‌లో ఉంది. ఇంకా 12,865 ఎకరాలు రిజిష్టర్ కావాల్సి ఉంది.

**ప్రశ్న:** రిజిష్టర్ కానివి ఏవిధమైన భూములు?

**జేడీ :** రిజిష్టర్ కాని భూములలో ఎక్కువగా డికెటి, అసైన్డ్, రెవెన్యూ అభ్యంతరాలు ఉన్న భూములు ఉన్నాయి.

**ప్రశ్న:** అభ్యంతరాల ఉన్న భూములకు అనుమతులు ఏవిధంగా ఇస్తారు?

**జేడీ :** రెవెన్యూ అధికారుల నుంచి అనుభవ పత్రం తీసుకొస్తే 11 నెలలకు అనుమతులిస్తాం. ఇప్పటి వరకు 1200 మంది ఆవిధంగా తెచ్చుకున్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు పోటీలు

బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 6, 7 తరగతి విద్యార్థులకు జూనియర్ విభాగంలో, 8, 9 తరగతి విద్యార్థులకు సీనియర్ విభాగంలో పోటీలు జరిపారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. కమిషనర్ పోటీలను పర్యవేక్షించి మొదటి మూడు స్థానాలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, సీహెచ్ కరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి శ్రీచెన్నకేశవస్వామి వార్షిక కలాణోత్సవాలు

పిట్టలవానిపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న సనాతనమైన శ్రీచెన్నకేశవస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నట్టు త్రిముఖ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. అగ్నిహోత్రం మారుతి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి అనువంశిక అర్చకస్వాములైన వేదాంతం నరసింహాచార్యులు వారి వంశీకులు, వేదాంతం జగన్నాధ చార్యులు, వారి వంశీకులు వేదాంతం రామానుజాచార్యుల వారి వంశీకులతో అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని ఆయ న చెప్పారు.

## యువత పోరును జయప్రదం చేయండి

- మాజీ మంత్రి మేరుగ నాగార్జున

బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలబడి కూటమి ప్రభుత్వంపై నిరసన గళం విప్పేందుకు వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదిన చేపడుతున్న యువత పోరును జయప్రదం చేయాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున పిలుపునిచ్చారు. బాపట్ల వైసీపీ కార్యాలయంలో శనివారం యువతపోరు పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతిదీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల బకాయిలను, నిరుద్యోగ యువతకు రూ.3 వేల భృతి ఇవ్వాలన్నారు. బాపట్లలో ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళి వినతి పత్రం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

## లోక్ అదాలత్‌లో 30 కేసుల పరిష్కారం

వేమూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 2020 మే 16 నుంచి 2024 అక్టోబరు 15వ తేదీ వరకు నమోదు చేసిన 30 కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించడం జరిగిందని ఎక్సైజ్ శాఖ సీఐ రవి తెలిపారు. శనివారం తెనాలి కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కేసులను పరిష్కరించి సంబంధించిన వ్యక్తుల ద్వారా రూ.1,77,300లు జరిమానా చెల్లింపులు కూడా జరిపినట్లు తెలిపారు.



## మూడు శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

వేమూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీరాజ్, హౌసింగ్, విద్యా శాఖల అధికారులతో శనివారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పంచాయితీరాజ్ అధికారులతో మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా ఫేజ్-1లో ఎంతవరకు పనులు పూర్తి చేశారని ప్రశ్నించారు. రూ.11 కోట్ల నిధులతో 64 పనులను చేపట్టడం జరిగిందని వాటిలో 53 పనులు పూర్తి కాగా 11 పనులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ఆటంకాలను తెలుసుకున్నారు. వాటిని కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫేజ్-2 ద్వారా 34 పనులను గుర్తించినట్లు అధికారులు నివేదికల ద్వారా వివరించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడుతూ, 89 గ్రామాలలో ప్రభుత్వం ద్వారా పొందిన స్థలాల లబ్ధిదారులలో తక్షణమే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేందుకు సిద్ధమైన వారి జాబితాను తయారు చేసి తనకు అందించాలన్నారు. విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ, పాఠశాలల పని తీరు, సౌకర్యాల కల్పన, కొత్తగా ప్రవేశపెట్టిన మెనూ అమలు, గత ప్రభుత్వంలో అర్థాంతరంగా నిలిచిపోయిన పాఠశాలల భవనాల నిర్మాణాలు తదితర అంశాలపై చర్చించారు. నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించే విధంగా ఇంజనీరింగ్ శాఖ ద్వారా చర్యలు చేపడతామని ఆనందబాబు అధికారులకు తెలిపారు.



పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

## నత్తనడకన పట్టణ ఆరోగ్య కేంద్రం పనులు



13వ వార్డులో నత్తనడకన నిర్మిస్తున్న కమ్యూనిటీ వైద్యశాల భవనం

రేపల్లె, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో 13వ వార్డులో పట్టణ ఆరోగ్య కేంద్ర భవనానికి రూ.99.95 లక్షల నిధులు మంజూరుచేశారు. 2021 జూలై నెలలో శంకుస్థాపన చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిదులు పూర్తిస్థాయిలో మంజూరుకాకపోవటంతో భవన నిర్మాణం అర్థంతరంగా ఆగిపోయింది. పనులు ప్రారంభించి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా నేటికి పూర్తిస్థాయిలో భవన నిర్మాణ పనులు జరిగిన దాఖలాలు లేవు. దీని కారణంగా పట్టణ ఆరోగ్య కేంద్ర భవనం అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పదినెలలు కావస్తుందని, ఇప్పటికైనా ప్రజా ఆరోగ్యశాఖ నాయకులు దృష్టిసారించి ఈ భవనాన్ని పూర్తి చేసి పేదలకు వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## బయోమైనింగ్ తీరును పరిశీలించిన కమిషనర్



డంపింగ్ యార్డు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డంపింగ్ యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ తీరును మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి శనివారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. తదుపరి పటేల్‌నగర్ మొదటిలైన్‌లో పారిశుద్య కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. దోమల బెడద ఎక్కువగా ఉన్నందున డ్రైనేజి పూడిక పనులు నిత్యం చేయాలని చెప్పారు. కోతుల బెడదపై స్థానికులు ఫిర్యాదు చేయగా త్వరలోనే కోతులను పట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. పట్టణంలో తాగునీటి సరఫరా తీరును 29వ వార్డు కార్యదర్శి పెదమస్తాన్ నగర్, బెస్తపాలెంలో పర్యటించి ప్రజలనుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పైపులైన్ లీకేజి పనులను పరిశీలించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టిన పి-4 సర్వేను పరిశీలించి సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, శానటరి ఇన్‌స్పెక్టర్‌లు సి.హెచ్.కరుణ,డి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


## 170 క్వింటాళ్ళ రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ షేక్ సలీమా, డీటీ ఫణికుమార్ తదితరులు

బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమ విక్రయాలకు అడ్డాగా మారిన బాపట్లలో అధికారులు మరోసారి దాడులు నిర్వహించి 170 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి ఈబీ విలియమ్స్ ఆధ్వర్యంలో తహసీల్దార్ షేక్ సలీమా, డిప్యూటీ తహసీల్దార్ ఫణికుమార్‌లు సిబ్బందితో కలిసి వెదుళ్ళపల్లిలోని శ్రీ శ్రీనివాస అయ్యప్ప ట్రేడర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. 340 బ్యాగ్‌లలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం బియ్యం 170 క్వింటాళ్ళు ఉంటాయని నిర్ధారించి సీజ్ చేశారు. మిల్లు నిర్వాహకులపై 6ఎ కింద కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ యలమంద, వీఆర్వో రామకృష్ణ తదితరులు ఉన్నారు.


## జాతీయ లోక్‌అదాలత్‌లో 210 కేసుల పరిష్కారం



జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు విచారిస్తున్న న్యాయమూర్తులు

బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కోర్టుల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 210 కేసులు పరిష్కరించారు. 15 సివిల్ కేసులు, 184 క్రిమినల్ కేసులు, 11 ప్రీలిటికేషన్ కేసులు పరిష్కరించారు. మొత్తం 1,02,56,577 రూపాయల లావాదేవీలు జరిగాయి. బాపట్ల జిల్లా 6వ అదనపు జడ్జి కె.శ్యాంబాబు, జి.వాణి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్‌లు కేసులు విచారించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేంద్రనాథ్, బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్, లోక్ అదాలత్‌మెంబర్లు బీమా లీలా కృష్ణ, ఇమ్మడిశెట్టి సురేష్‌బాబు, సీహెచ్ సౌలురాజులు వ్యవహరించారు. న్యాయవాదులు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా భాస్కరరావు



జి.భాస్కరరావు

బాపట్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా జి.భాస్కరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లాలో డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. గతంలో బాపట్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న జి.ఆంజనేయులు పదోన్నతిపై బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతిపై వెళ్ళారు. ఆయన స్థానంలో భాస్కరరావును నియమించారు. శనివారం బాధ్యతలు చేపట్టిన ఆయనను డీఈ టి.శ్రీనివాసరావు, పొన్నూరు డీఈ శ్యామ్, ఏఈఈలు కలిసి అభినందనలు తెలిపారు.

## సర్వేను సక్రమంగా నిర్వహించాలి : ఎంపీడీవో

కర్లపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న పి4 సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంపిడివో అద్దూరి శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని పెదపులుగువారిపాలెం గణపవరం గ్రామాలలో శనివారం జరుగుతున్న పి4 సర్వేనుఎంపిడివో, ఈవోపిఆర్డీతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పిల్లల సాంబశివరావు, ఈవోపిఆర్డీ శ్రీనివాసరావు, రవళి తదితరులు పాల్గొన్నారు.

### పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో 12 సచివాలయాల ఉద్యోగులతో కలిసి పిట్టలవానిపాలెం ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు ఆధ్వర్యంలో పి4 సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చందోలులో జరిగిన సర్వేలో బాపట్ల అసిస్టెంట్ డైరెక్టర్, చీఫ్ ప్లానింగ్ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొని ప్రతి ఇంటికెళ్ళి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి బి.సుజాత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆరుగురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఆరుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అందజేశారు. భట్టిప్రోలు గ్రామానికి చెందిన ఆరుగురు వివిధ అనారోగ్య సమస్యలతో ఎమ్మెల్యేను ఆశ్రయించగా ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేశారు. అక్కడ నుంచి వచ్చిన మొత్తం రూ.4,29,650 విలువ కలిగిన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సీపీఎం సానుభూతిపరుడి మృతి



శ్యాంబాబు (ఫైల్)

కొల్లూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో సీపీఎం సానుభూతిపరుడు మృతి చెందినట్లు ఆ పార్టీ నాయకులు శనివారం తెలిపారు. మండలంలోని తిప్పలకట్ట గ్రామానికి చెందిన మండే శ్యాంబాబు (46) హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కార్యకర్త మృతికి పార్టీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, పంతగాని నాగమల్లేశ్వరరావు, బీఎల్‌కే ప్రసాద్, బిసుబ్బారావు, టి.సురేష్‌లు సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు.

# ఉత్సాహంగా మహిళా దినోత్సవం

- మహిళాభివృద్ధికి పెద్దపీట
- ఎమ్మెల్యే కొండయ్య
- మెప్మా సంఘాలకు రూ.3.80కోట్ల చెక్కుల పంపిణీ

చీరాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభివృద్ధికి కూటమి పెద్దపీట వేస్తుందని, ప్రస్తుతం దేశంలోనే వారు అత్యున్నత స్థానాల్లో ఉండి విజయాలు సాధిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నా రు. శనివారం పట్టణంలో మహిళా దినోత్సవ కార్యక్రమాలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఫ్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణంలోని ఐఎంఏ హాలు నుంచి ముక్కోణం పార్క్ వరకు చిన్నారులతో కలిసి సైకిల్ ర్యాలీలో కొండయ్య పాల్గొని అందరినీ ఉత్సాహ పరిచారు. గడియార స్తంభం కూడలిలో చిన్నారుల నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. అనంతరం మెప్మా సీఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సతీమణి బాలకొండమ్మతో హాజరయ్యారు. మహిళల రక్షణకు ప్రభుత్వం శక్తి యాప్ ప్రారంభించినట్లు వివరించారు. ఈ సందర్భంగా 126 పొదుపు సంఘాల గ్రూపులకు రూ.3.80 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.


చిన్నారులతో కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య



సెయింట్ ఆన్స్ వేడుకల్లో మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

### సెయింట్ ఆన్స్ కళాశాల ఆధ్వర్యంలో

మహిళలు లింగ వివక్షను వీడి విద్య, వ్యాపార రంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.సుధ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌కే రిహానా, డా. కే అనిత అన్నారు. సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తులు హాజరై ఉపన్యసించారు. కార్యక్రమంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ డా.జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### మహిళా మండలిలో

మహిళ మండలిలో మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే జనసేన పార్టీ వీర మహిళల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, ఈపూరుపాలెంలో జరిగిన వేడుకల్లో ట్రైనీ డీఎస్పీ అభిషేక్, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు. వాడరేవులో సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి పాల్గొన్నారు.

పంగులూరు : మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకారంతో పాటు సమాజం తగిన తోడ్పాటు అందించాలని అద్దంకి రూరల్ సీఐ డి.మల్లికార్జునరావు అన్నారు. ముప్పవరంలోని వసతి గృహ బాలికలతో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ. వినోద్‌బాబు, వార్డెన్ పద్మావతి, వసతి గృహ బాలికలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు స్వయం శక్తితో అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగడం ద్వారానే సమాజం ప్రగతి పథంలో ముందడుగు వేస్తుందని వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. మహిళలకు పలు పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. వెలుగు కార్యాలయ సిబ్బంది శకిలమ్మ, ఎకౌంటెంట్ భాస్కరమ్మను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షులు గొట్టిపాటి వెంకటరత్నం, సీసీలు సాల్మన్, సురేష్, చంద్రశేఖర్, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఏజండ్ల మాధవి, వజ్రాల కమలాదేవి, ఉపాధ్యక్షురాలు శైలజ, కోశాధికారి భారతి, పద్మావతి, వీవోఏలు పాల్గొన్నారు.


వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మీపద్మావతి

### ట్రాఫిక్ నిబంధనలపై తండ్రులకు అవగాహన కల్పించాలి

**సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి**

అద్దంకి : విద్యార్థులు తల్లిదండ్రులకు, కుటుంబసభ్యులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని, కచ్చితంగా ఆచరిస్తారని సీనియర్ సివిల్ న్యాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. మండల న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు బీసీ బాలికల వసతి గృహం నుంచి కోర్టు భవనాల సముదాయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐ సుబ్బరాజు, ఎస్సై ఖాదర్‌బాషా, న్యాయవాదులు శ్రీనివాసరావు, ప్రకాషరావు పాల్గొన్నారు.

### బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయాధికారులకు సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అద్దంకి బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బార్ అసోసియేషన్ హాల్ లో న్యాయాధికారులు నాగవెంకటలక్ష్మి, శ్రీసీత, మహిళా న్యాయవాదులను ఘనంగా సన్మానించారు.

అద్దంకిటౌన్ : మహిళలు అన్ని రంగాలలో ముందంజలో దూసుకుపోతున్నారని, మహిళను అందరం గౌరవించాలని పలువురు వక్తలు అన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించార ఏపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళ ఉద్యోగులను సత్కరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో కార్యాలయంలో సీనియర్ రోటరీ మహిళ సభ్యులు జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మి, కృష్ణవేణి, కోట అందజమ్మను సత్కరించారు. బాపట్ల జిల్లాలో జరిగిన వేడుకలలో అద్దంకి ఆర్టీసీ డిపో సీనియర్ కండక్టర్ లేబూరి ఉ మామహేశ్వరి పాల్గొని తన సందేశాన్ని విన్పించడంపై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

మేదరమెట్ల : మహిళలు ఉన్నత విద్యా అభ్యసంతోనే సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందగలని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు తుళ్ళూరి వెంకటరమణను వెలుగు కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రాజ్యం, మారుతి, మాణిక్యరావు, ఏపీఎం భాస్కర్, సీసీలు మస్తాన్ వలి, సాంబయ్య, మేరి కుమారి, కోటేశ్వరరావు, వి వోఏలు పాల్గొన్నారు.

మార్టూరు : వెలుగు కార్యాలయంలో ఏపీఎం సురేంద్ర, ఉపాధి ఏపీవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో వీవోఏలు, డ్వాక్రామహిళలు,మండల సమాఖ్య సభ్యులు ప్రత్యేకంగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటలపోటీలను నిర్వహించి బహుమ తులను అందజేశారు. దీపిక, రామేశ్వరమ్మను సత్కరించారు.

చినగంజాం : మహిళల అభ్యున్నతితోనే సమాజ ప్రగతి సాధ్యమని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ ఆధ్వర్యంలో మహిళా గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యాలయంలోని మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా ఉద్యోగులను తహసీల్దార్ సన్మానించారు. వెలుగు కార్యాలయ ఆవరణలో ఏపీఎం పెద్దసుబ్బారావు ఆధ్వర్యంలో వీవోఏలు, డ్వాక్రా మహిళలకు పోటీలు నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకురాలు యార్లగడ్డ లక్ష్మి, పర్చూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జరుబుల సంధ్యారాణి, ఏపీవో లక్ష్మీదేవి, హెచ్‌ఎం రత్నకుమారి, సీహెచ్‌సీ వైద్యాధికారి కీర్తిసరోజ్, మహిళా కానిస్టేబుల్ కవితను సన్మానించారు.

### ఓర్పు, సహనమే మహిళల ఆభరణాలు

**సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి**

పర్చూరు : ఓర్పు, సహనమే సమాజంలో మహిళలకు ఆభరణాలని, సమాజంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న మహిళలను ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పర్చూరు కోర్టు భవనాల సముదాయ న్యాయాధికారులు పాల్గొన్నారు. పీఎం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యులు దాసరి ఉషారాణి, సీసీలు విజయకుమార్, శ్రీనివాసమూర్తి, నరసింహం, ప్రమీలా, న్యాయవాదులు పాల్గొన్నారు. కారంచేడు మండల పరిధిలోని ఆదిపూడి గ్రామంలో జై జపాలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా నర్సారావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బండారు సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి


సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు

## అంగన్‌వాడీలకు గ్రాట్యుటీపై హర్షం

అద్దంకిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ వర్తింపచేస్తూ ప్రభుత్వం జీవోను విడుదల చేయడం పట్ల తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి అన్నారు. శనివారం మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర కమిటీ సభ్యులు కలిశారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మీనరసమ్మ, కోశాధికారి హేమలత, కాత్యాయని, సామ్రాజ్యం ఉన్నారు.

## పీ-4 సర్వేను ప్రణాళికతో నిర్వహించాలి

**ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు**


సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

వేటపాలెం(చీరాల), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన పీ-4 సర్వేను ప్రతి ఇంటికీ వెళ్లి స్పష్టమైన ప్రణాళికతో నిర్వహించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. వేటపాలెం మండలంలో శనివారం ప్రారంభమైన సర్వేను ఆర్డీవో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల లాగిన్‌లకు ఇప్పటికే ప్రతి ఇంటికీ సంబంధించిన డేటా అందుబాటులో ఉందన్నారు. సిబ్బంది విధిగా ఇంటికీ వెళ్లి 16 అంశాలపై పూర్తి డేటాను సక్రమంగా సేకరించి ఎంట్రీ చేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

## పోరాటాలతో అందరికీ గుర్తుంటారు


ప్రతిభామూర్తుల చిత్రటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభా మూర్తులు, ఉద్యమకారులు సమాజంలోని తాము చేసిన పోరాటాలతో అందరికీ గుర్తుంటారని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అద్దంకి డిపో ఆధ్వర్యంలో చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభా మూర్తులు-మధుర స్మృతులు సభ రిటైర్డ్ టీచర్ యనమండ్ర వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. కోట సుందరమ్మ, జయలలిత చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అద్దంకి ప్రాంత స్వాతంత్ర్య సమరయోధురాలు సుందరమ్మ జీవిత విశేషాలను టీచర్ దాసరి లక్ష్మీరాజ్యం, సినీనటి, మాజీ సీఎం జయలలిత సినీ జీవిత విశేషాలను రోటరీ సభ్యురాలు కొల్లా భువనేశ్వరి తెలిపారు. మ హిళా సాధికారత గురించి జ్యోతిష్మతి వివరించారు. అనంతరం వరలక్ష్మి, పి. కామేశ్వరి, కె.భువనేశ్వరి, జ్యోతిష్మతి, లక్ష్మీరాజ్యంను సన్మానించారు. సంఘ అధ్యక్షుడు కోటయ్య, వీరయ్య, దేవపాలన, ప్రసాద్, త్రిమూర్తులు, రాఘవరావు, నాగేశ్వరరావు, బ్రహ్మం, మలాది శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు.

## కాలువల నిర్మాణానికి ఆక్రమణల తొలగింపు

బల్లికురవ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలో సైడు కాలవల నిర్మాణానికి ప్రధాన వీధిలో ఉన్న ఆక్రమణలను తొలగించే పనులు శనివారం నుంచి ప్రారంభించారు. టీడీపీ నేత దద్దాల అంజయ్య పర్యవేక్షణలో కాలవల ఏర్పాటుకు పనులు చేపడుతున్నారు.

## కారును ఢీకొన్న లారీ

బల్లికురవ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి రామాంజనేయపురం వద్ద శనివారం కారును లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినడంతో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి నర్సారావుపేట వైపు నుంచి వస్తున్న కారును రామాంజనేయపురం వద్ద రోడ్డుపైకి వస్తున్న లారీ వెనక నుంచి ఢీకొట్టింది. గాయపడిన డ్రైవర్‌ను వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సను అందించారు.

## కొండపై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బల్లికురవ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాత మల్లాయపాలెం గ్రామ సమీపంలో ఉన్న బోడుకొండపై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం మేకల కాపరులు కొండపై కంపు రావడంతో గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంతమాగులూరు సర్కిల్ సీఐ కె.వెంకట్రావు వెళ్లి పరిశీలించగా చెట్టుకు మృతదేహం వేలాడుతుంది. గ్రానైట్ క్వారీల్లో పనులకు వచ్చే ఇతర రాష్ట్రాలకు చెందినవాడిగా అనుమానిస్తున్నారు.

## వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

పర్చూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి ఆళ్ల మస్తాన్‌రావు తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో భౌభౌలతో బేంబేలు అనే కథనంపై అధికారులు స్పందించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కుక్కలను పట్టించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ట్రెజరీ అధికారులు సహకరించాలి

అద్దంకిటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి కుటుంబ పెన్షనర్ల అడిషినల్ క్యాంటమ్ పెన్షన్ విషయంలో ట్రెజరీ అధికారులు సహకరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా శాఖ-2 అధ్యక్షుడు రావూల బాపయ్య చౌదరి కోరారు. శనివారం సంఘ సమావేశం పుట్టంరాజు కళాక్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆయా శాఖలకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 12 మార్టూరు, 19న ఇంకొల్లు, 26న అద్దంకి శాఖలకు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కరి కమలేశ్వరరావు, కోశాధికారి పుట్టంరాజు శ్రీ రామచంద్రమూర్తి, అద్దంకి మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, కృష్ణయ్య, కోశాధికారి కోటేశ్వరరావు, మార్టూరు, ఇంకొల్లు శాఖల సభ్యులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వేటపాలెం(చీరాల), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని 55-60 మధ్య వయస్సు గల వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. వేటపాలెం మండలం కొత్తరెడ్డి పాలెంలోని ఓ రొయ్యల కంపెనీ సమీపంలో మృతి చెంది పడివుండగా, ఎస్ఐ వెంకటేశ్వర్లు సమాచారాన్ని అందుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతిచెందిన వ్యక్తిని యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు.

## అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

మార్టూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తిచెంది పురుగుమందును తాగి తాళ్లూరి చినబాబు (41) ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వలపర్ల గ్రామ ఎస్సీకాలనీలో చినబాబు నివాసముంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు మగపిల్లలున్నారు. వలపర్ల, నాగరాజుపల్లి మధ్య మొక్కజొన్న తోటలో శనివారం చినబాబు మృతదేహాన్ని పొలంవెళ్లినవారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చినబాబు భార్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ ఎం.శేషగిరిరావు కేసు నమోదు చేశారు.


ఉప్పుటూరులోని ఎత్తిపోతలను పరిశీలిస్తున్న అధికార బృందం

## ఎత్తిపోతల పథకాల పరిశీలన

పర్చూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఉప్పుటూరులో పురందేశ్వరి ఎత్తిపోతల పథకాన్ని బృందం శనివారం పరిశీలించింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారిన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టి సారించారు. ఈమేరకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఎత్తిపోతల పథకాల పరిస్థితిపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు విశ్రాంత డీఈతో బృందాన్ని ఏర్పాటు చేశారు. పర్చూరు వాగు, వివిధ కాల్వలు, సాగర్, కొమ్మమూరు కాలువల నీరు సద్వినియోగం చేసుకునేందుకు రైతులు, ప్రభుత్వం భాగస్వామ్యంతో నిర్మించిన పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించాలని ఏలూరి సంకల్పించారు. కార్యక్రమంలో అధికారులతోపాటు, నీటి సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పలు కార్యక్రమాలకు హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు చిలకలూరిపేట, 10-30 గంటలకు ముప్పవరం, 11 గంటలకు చినమల్లవరం, 11-30 గంటలకు బూదవాడ, 12 గంటలకు రేణింగవరం, మధ్యాహ్నం 1 గంటకు అంబడిపూడి, 1-30గంటలకు నక్కబొక్కలపాడులో జరిగే కార్య క్రమాల్లో పాల్గొంటారు.

## పండుగలు, సంప్రదాయాలను గౌరవించాలి

**అలరించిన విజ్ఞాన ప్రదర్శన**


విజ్ఞాన ఎగ్జిబిషన్‌లో తెలుగు ప్రాధాన్యతపై ప్రదర్శన చూపుతున్న చిన్నారులు

చీరాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పాపరాజుతోటలోని శ్రీరాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్లో డైరెక్టర్ గవిని మణికుమార్ ఆధ్వర్యంలో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి హాజరయ్యారు. ఈక్రమంలో చిన్నారులు తెలుగు పండుగలు, సంప్రదాయాలు, మెదడకు మేత, సైన్స్‌తో సరదాలు, గ్రహాలు వాటి తీరుతెన్నులు, గణితంతో గమ్మత్తులు, భాషా భాగాలు, వ్యా కరణ విశేషాలు, రాజ్యాంగ నిర్మాతలు 299 మంది బంధ కవిత్వం తదితర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏలూరి కంటి వైద్య శిబిరానికి స్పందన

- 364 మందికి వైద్య సేవలు
- మహిళా అభ్యున్నతికి ఎమ్మెల్యే ఏలూరి కృషి
- కొనియాడిన వక్తలు


వివిధ రంగాలకు చెందిన మహిళలను సన్మానిస్తున్న ప్రముఖులు, నాయకులు

ఇంకొల్లు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) :ఎమ్మెల్యే ఏలూరి సారథ్యంలో టీడీపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏలూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పం దన లభించింది. ఏలూరి చారిటబుల్, నోవా అగ్రిటెక్, గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ సంయుక్తంగా గుంటూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో శనివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 364 మందికి వైద్యసేవలు అందించారు. రక్త, బీపీ, షుగరు పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యురాలు డా.అనూష రోగులకు పరీక్షలు నిర్వహించారు. 159 మంది కి శస్త్రచికిత్సలు అవసరంగా నిర్ధారిం చారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి కృషిని వక్తలు కొనియాడారు. మహిళలకు కుట్టుమిషన్లు, మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తూ కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. అనంతరం మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పంచాయితీ కార్మికులను ఘనంగా సన్మానించారు. నాగులచెరువుకట్ట వద్ద మహిళా సేవా సంస్థకు కేటాయించిన గదిని టీడీపీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నాయుడు హనుమంతరావు, మార్క్, పాలేరు రామకృష్ణ, వీరగంధం ఆంజనేయులు, డాక్టర్ శ్యాంసుందర్,కరి శ్రీను, సంధ్య, శివాజీ, ఇంకొల్లు సీఐ రమణయ్య, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

### లోక్ అదాలత్‌లో 230 కేసుల పరిష్కారం

**రూ.88,99,573 చెల్లింపునకు అంగీకారం**

అద్దంకి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఇరు పక్షాలు రాజీ పడడం ద్వారా విజయం సాధించినట్లేనని సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం కోర్టు భవనాల సముదాయంలో జరిగిన లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత ఆధ్వర్యంలో రెండు బెంచ్‌లలో మొత్తం 230 కేసులు పరిష్కారమయ్యాయి. ఒరిజనల్ సూట్స్ 12 (25.50 లక్షల రూపాయలు), ఎగ్జిక్యూషన్ పిటిషన్ 4 (6,58,573 రూపాయలు), క్రిమినల్ కేసులు ఐపీసీ 75, నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్ యాక్ట్ 11 (38.41 లక్షల రూపాయలు), ఎక్సైజ్ కేసులు 122, భరణం కేసులు 4 (18.50 లక్షలు), గృహహింస కేసులు 2 పరిష్కారం అయ్యాయి. వీటికి సంబంధించి 88,99,573 రూపాయలు చెల్లింపులకు ఇరుపక్షాల మధ్య అంగీకారం కుదిరింది. లోక్‌అదాలత్ సభ్యులు హైగ్రీవాచారి, రమణయ్య, అనూష, సంజీవ్‌బాబు పాల్గొన్నారు.

### హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేయండి

బల్లికురవ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో ఉన్న హిందు స్మశాన వాటికను అభివృద్ధి చేయాలని అమ్మ ఆశ్రమానికి చెందిన జ్ఞాన ప్రసూన బాబా సూచించారు. శనివారం మండలంలోని కొండాయపాలెంలోని హిందూ శ్మశాన వాటికను గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామానికి అమ్మ ఆశ్రమానికి చెందిన జ్ఞాన ప్రసూన బాబా పరిశీలించారు. ఈసందర్భంగా అయన గ్రామ పెద్దలతో మాట్లాడారు. గ్రామానికి చెందిన మురగొండ ఆంజనేయులు జ్ఞాపకార్థం ఆయన కుమారులు అర ఎకరం స్థలాన్ని శ్మశాన వాటికకు ఇస్తామని ముందుకు రాగా వారిని అయన అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ధూళిపాళ్ల రామగోవిందు, అంజనేయులు పాల్గొన్నారు.

### బాలికల సాధికారతకు నిరంతరం కృషి

**విద్యార్థినులకు 76 సైకిళ్ల పంపిణీ**


విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

చీరాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బాలిక సాధికారతకు తాము ఎల్లప్పుడు కృషిచేస్తున్నామని, ఇటువంటి సేవలు ఎంతో ఆనందాన్నిస్తున్నాయని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా. చిలుకూరి శరత్‌బాబు, డా.అన్నపూర్ణ దంపతులు అన్నారు.శనివారం చీరాల పరిధిలోని 76 మంది నిరుపేద విద్యార్థినులకు రోటరీక్లబ్ ఆఫ్ చీరాల, వేటపాలెం, క్షీరపురి రోటరీ క్లబ్ చీరాల, వేటపాలెం ఆధ్వర్యంలో గవర్నర్ దంపతుల ఆర్థిక సాయం రూ.3లక్షలు విలువగల సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ సమావేశం హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలికలు విద్యా రంగంలో విశేషంగా రాణించి ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్, నరేంద్రబాబు, భాను ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, వెంకట సురేష్, బాలికలు పాల్గొన్నారు.